అవసరాలు, సామర్థ్యాల మేరకే ఎక్స్‌టెన్షన్లు

- ఇరిగేషన్‌శాఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ అవసరాలు, విరమణ పొందిన ఉద్యోగుల సామర్థ్యాల మేరకే వారి సర్వీస్‌ను కొనసాగించడం, రద్దు చేయడం జరుగుతుందని ఇరిగేషన్‌శాఖ వెల్లడించింది. ఈ మేరకు సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఎక్స్‌టెన్షన్ పొందిన వారు వివిధ హోదాల్లో సుమారు 72మంది ఉన్నారు. సదరు ఉద్యోగుల జాబితాను ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ గతంలోనే ప్రభుత్వానికి నివేదించారు. ఆ జాబితాలోని ఒక్కో ఉద్యోగి వారీగా పరిశీలించినట్టు రాహుల్‌బొజ్జా వెల్లడించారు. సదరు ఉద్యోగుల నైపుణ్య సామర్థ్యాలు, డిపార్ట్‌మెంట్ అవసరాల నేపథ్యంలో కొందరిని యథావిధిగా కొనసాగిస్తున్నామని, మరి కొందరిని తొలగిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు స్వతహాగా రాజీనామా చేయగా, కొందరి పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం మొత్తంగా శాఖలో 37మందిని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. వారిలో ఎక్కువగా ఏఈలు, టెక్నికల్ ఆఫీసర్లు మాత్రమే ఉండగా, వారు కూడా టీజీపీఎస్సీ ద్వారా రెగ్యులర్ ఉద్యోగులు వచ్చే వరకు మాత్రమే ఉంటారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి

- డిప్యూటీ సీఎం భట్టికి ఆ సంఘం నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విద్యుత్తు ఉద్యోగ సంఘాల నాయకులు విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన భట్టి.. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని విద్యుత్తుశాఖ సీఎండీలను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్తు ఉద్యోగ సంఘాల నాయకులు రత్నాకర్‌రావు, శ్రీధర్, బీసీ రెడ్డి, వరప్రసాద్, వేణుగోపాల్, సదానందం, వేణు, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరాజు, పీవీ రావు, ప్రశాంత్, కిశోర్, వెంకటేశ్, సుజిత్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

రాష్ట్రంలో పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. జూలై 2022 నుంచి రావాల్సిన నాలుగు విడతల(14.56 శాతం)డీఏ మంజూరు చేయాల్సి ఉండగా, నేటికీ ఉత్తర్వులు ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే రాష్ట్రంలో కూడా డీఏ ప్రకటించేలా శాశ్వత విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు దాసరి శ్రీధర్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలి: టీఎస్‌యూటీఎఫ్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసి 40 రోజులు గడుస్తున్నా అప్పీళ్లను పరిష్కరించకపోవడం తగదని టీఎస్‌యూటీఎఫ్ ఆక్షేపించింది. వెబ్ కౌన్సెలింగ్‌లో ప్రక్రియ జరిగినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాల కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అప్పీళ్లకు వారంపాటు గడువు ఇచ్చిందని, అప్పీళ్ల పరిష్కారం కాకపోవడంతో వారు నిత్యం డైరెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారని పేర్కొంది. అప్పీళ్లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు.

పదోన్నతులు కల్పించండి

తమకు పదోన్నతులు కల్పించాలని సచివాలయ సెక్షన్ ఆఫీసర్లు(ఎస్‌వో), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు (ఏఎస్‌వో)ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎస్‌వోలు, ఏఎస్‌వోలు గురువారం సచివాలయంలో జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావును కలిసి విన్నవించారు. ప్రభుత్వం అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించినట్టే తమకు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రఘునందన్‌రావు వారికి హామీ ఇచ్చారు.

'జాతీయ స్థాయి' దవాఖానలో వైద్యుల్లేరు!

- బదిలీపై వెళ్లిన కౌటాల పీహెచ్‌సీ సిబ్బంది

కౌటాల, ఆగస్టు 8: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం వైద్యుల్లేరు. కాంగ్రెస్ సర్కారు పుణ్యమా అని ప్రస్తుతం సిబ్బంది అంతా బదిలీపై వెళ్లడంతో ఇక్కడ మందు గోలీలిచ్చే నాథుడే లేడని రోగులు వాపోతున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించినందుకు అప్పటి వైద్యాధికారి పల్లవికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని గుర్తుచేస్తున్నారు. గతంలో ప్రతి నెలా 30 నుంచి 35 వరకు సాధారణ ప్రసవాలు జరిగాయని, సిబ్బంది రాత్రింబవళ్లు వైద్యసేవలు అందించి ప్రశంసలు అందుకున్నారని పేర్కొంటున్నారు. సిబ్బంది అంతా బదిలీపై వెళ్లగా.. స్టాఫ్ నర్సు మాత్రమే ఉండేది. ఆమె కూడా ఇటీవల బదిలీ అయ్యింది. లోనవెల్లి వైద్యాధికారి నవతను ఈ దవాఖానకు ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. సాయంత్రానికల్లా దవాఖాన మూతపడుతున్నదని రోగులు మండిపడుతున్నారు.

స్మగ్లింగ్ చేసే వారే ఇప్పటి హీరోలు: పవన్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో గురువారం సమావేశమైన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనంతరం చేసిన వ్యాఖ్యలు మెగా, అల్లు అభిమానుల మధ్య చిచ్చు రాజేశాయి. ఏపీ, కర్ణాటక మధ్య వన్యప్రాణులు, అటవీ సంరక్షణ, కుంకి ఏనుగులను ఏపీకి తీసుకురావడం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం విలేకరులతో పవన్ మాట్లాడుతూ 40 ఏండ్ల క్రితం సినిమాల్లో హీరోలు అడవులను కాపాడేవారని, ఇప్పటి సినిమాల్లో హీరోలు అడవుల్లో చెట్లను నరికి స్మగ్లింగ్ ఎలా చేయాలో చూపిస్తున్నారని చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కన్నడ సూపర్‌స్టార్ రాజ్‌కుమార్ నటించిన 'గందదగుడి' సినిమాను ప్రస్తావించిన పవన్.. ఆ సినిమాలో హీరో అడవులను కాపాడతాడని, కానీ ఇప్పుడు హీరోలు అడవిలో చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు తెరలేపాయి.

బీర్ల ధరలు భారీగా పెంపు?

- ధరల పెంపుపై ఎక్సైజ్ కమిటీ తర్జన భర్జన
- 15-20 శాతం ధరలు పెరిగే అవకాశం!
- వినాయక నిమజ్జనం రోజు నుంచే కొత్త ధరలు?
- రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ ప్రతిపాదనలు?
- ఇప్పటికే అన్ని బ్రూవరీస్‌తో మాటామంతీ
- కేసుకు రూ.450 వరకు బ్రూవరీల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో భారీగా బీర్ల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిటీ గురువారం ఆబ్కారీభవన్‌లో సమావేశమైంది. ప్రభుత్వం ఇటీవల నిర్దేశించిన రూ.వేల కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే మద్యం ధరల పెంపు ఒక్కటే పరిష్కారమార్గంగా కనిపిస్తున్నది. దీనికితోడు ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే తక్షణం బీర్ల ధరలను పెంచాల్సిందేనని తెలుస్తున్నది. అయితే, బీర్ల ధరల పెంపుపై గురువారం సమావేశమైన ఎక్సైజ్ కమిటీ.. ధరల పెంపుపై తర్జన భర్జనలు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే సుమారు 15-20 శాతం ధరలు పెంచేందుకు ఓ నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. బీర్ల ఉత్పత్తి కేంద్రాల (బ్రూవరీల)కు ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలను 10-15శాతం మేర పెంచాలని, ఆ నష్టాన్ని పూడ్చుకొనేందుకు, ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు 15-20 శాతం ధరలు పెంచాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, భారం పూర్తిగా వినియోగదారులపైనే పడనున్నది.

ఒక్కో కేసుకు రూ.450 డిమాండ్

తెలంగాణలోని 6 బ్రూవరీల్లో ఏటా 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతున్నది. ఆ బీరును తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కొనుగోలుచేసి మద్యం దుకాణాలకు సరఫరా చేస్తుంది. 12 బీర్లు ఉండే ఒక కేసుకు బేవరేజెస్ కార్పొరేషన్ లైట్ బీర్లకు రూ.289, స్ట్రాంగ్ బీర్లకు రూ.313 చెల్లిస్తున్నది. అక్కడి నుంచి మద్యం దుకాణాలకు రూ.1,400 చొప్పున చేరుతున్నది. మద్యం దుకాణాలు ఒక్కో కేసు రూ.1,800 చొప్పున అమ్ముకుంటున్నాయి. తయారీ కేంద్రాల వద్ద సుమారు రూ.24కి లభించే ఒక బీరు.. కార్పొరేషన్ చేతి నుంచి మద్యం దుకాణాలకు వచ్చేసరి రూ.117.. వినియోగదారులకు వచ్చేసరికి రూ.150 అవుతున్నది. తమకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయని, 2021 నుంచి ఇప్పటి వరకు ధరలు పెంచలేదని.. ఇప్పుడు కనీసం 20-25 శాతం ధరలు పెంచాలని అన్ని బ్రూవరీలు ఎక్సైజ్ కమిటీ ముందు ప్రతిపాదన పెట్టాయి. ఈ నెల మొదటి వారంలో ఒక్కో రోజు ఒక్కో బ్రూవరీ ప్రతినిధులను పిలిచి.. ఎక్సైజ్ కమిటీ విడివిడిగా మాట్లాడింది. గతంలో ఒక్కో కేసుకు రూ.289 ఉంటే.. పెరిగిన నిర్వహణ దృష్ట్యా తమకు రూ.450 ఇవ్వాలని ఆ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బ్రూవరీలకు అడిగినంతా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఇవ్వాల్సి వస్తే.. బీర్ల ధరలు కనీసం 20 శాతం పెరగనున్నట్టు తెలిసింది.

ప్రభుత్వ లక్ష్యానికి మద్యం ప్రియులే దిక్కు!

మద్యం ఆదాయాన్ని మరో రూ.5,318 కోట్లు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొన్నది. ఎక్సైజ్‌శాఖలోని ఒక్క మద్యం విభాగం నుంచే రూ.25,617 కోట్ల నిధులను ఆశిస్తున్నట్టు వెల్లడించింది. ఆ మేరకు ఇప్పుడు బీర్ల ధరల పెంపునకు సిద్ధమైంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే బీర్లు, లిక్కర్ కలిపి కనీసం 25 శాతం అదనంగా మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉన్నది. దీంతో మరింత తాగించడం ఒకటి కాగా, రెండోది ధరలు పెంచడమే మార్గంగా కనిపిస్తున్నది. సర్కారుకు వస్తున్న ఆదాయ వనరుల్లో మద్యానిదే ప్రధాన పాత్ర. మద్యం అమ్మకాలు, ట్యాక్స్‌ల ద్వారా ఏటా సుమారు రూ.35 వేల కోట్ల వరకు సర్కారుకు ఆదాయం సమకూరుతున్నది. ఈ లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.45 వేల కోట్లకు పెంచింది. ఈ క్రమంలోనే బీర్ల ధరలకు త్వరలో రెక్కలు రాబోతున్నాయి.

వినాయక నిమజ్జనం రోజునే?

బీర్ల ధరల పెంపుపై గురువారం సమావేశమైన ఎక్సైజ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ధరల పెంపు ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వ పెద్దలు ఓ నిర్ణయం తీసుకోనున్నారు. బీర్ల ధరలు పెంచితే కొత్త ధరలను వినాయక నిమజ్జనం రోజునే అమల్లోకి తెస్తారని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కేవలం బీర్ల ధరలే పెరగనున్నాయి. ఇతర లిక్కర్ ధరలు యథావిధిగా ఉంటాయి. ఈ మేరకు మద్యం ఉత్పత్తిదారులతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ రీషెడ్యూల్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను రీ షెడ్యూల్ చేశారు. పాత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31 నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా, కొత్త షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 2 నుంచి మొదలుకానున్నాయి. టీజీ పీజీఈసీ/టీజీ పీజీఈసెట్-2024 ప్రవేశాల రీ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. ఈ నెల 25న అర్హుల జాబితా ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ నెల 27 నుంచి 28 వరకు అవకాశం కల్పించారు. ఈ నెల 29న వెబ్ ఆప్షన్ల సవరణ, సెప్టెంబర్ 1న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

12న డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 8 : ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 12న నేరుగా హాజరుకావాలని రిజిస్ట్రార్ రఘురాంరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఎగ్జామినేషన్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు విధిగా హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజు రూ.19,460(గవర్నమెంట్), రూ.22,210(ప్రైవేట్)తో హాజరుకావాలని సూచించారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాలి

- టీపీటీఎల్‌ఎఫ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో రెండో శనివారం సెలవు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్(టీపీటీఎల్‌ఎఫ్)తోపాటు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు ఆ సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన, డీఈవోలకు ఆర్డర్స్ ఇస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కల దాడి

ఉండవెల్లి, ఆగస్టు 8: ఇండ్ల ముందు ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ప్రాగటూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీకాంత, నగేశ్ దంపతుల కుమారుడు రిషి, చంద్రకళ, నాగరాజు కుమారుడు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, శారద కుమారుడు తిరుమలేశ్ కలిసి ఆడుకుంటున్నారు. వారిపై వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులను అలంపూర్, కర్నూల్ దవాఖానలకు తరలించామని తల్లిదండ్రులు తెలిపారు.

యాదగిరిగుట్టలో అఖండ దీపారాధన

యాదగిరిగుట్ట, ఆగస్టు 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అఖండ దీపారాధనకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానాలయ మాడ వీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. 32 ఫీట్ల పొడవు, 28 ఫీట్ల వెడల్పుతో ప్రత్యేకమైన రేకులతో కూడిన షెడ్డు నిర్మిస్తున్నారు.

జనగామ సీఐ, ఎస్సైపై బదిలీ వేటు

- న్యాయవాదులపై దాడి చేసినట్టు ఫిర్యాదులు

జనగామ చౌరస్తా, ఆగస్టు 8: న్యాయవాద దంపతులపై దాడి చేసినట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డితోపాటు ఎస్సై పీ తిరుపతిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ గురువారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కానిస్టేబుల్ బీ కరుణాకర్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు. వరంగల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ రెడ్డిని జనగామ అర్బన్ సీఐగా నియమించారు. ఈ నెల 5న ఓ కేసు విషయంలో స్థానిక న్యాయవాదులైన అమృతరావు, కవిత దంపతులపై సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ కరుణాకర్ దాడి చేసినట్టు ఫిర్యాదు రావడంతో బుధవారం కేసు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల నిరసనలతో బదిలీ వేటు వేశారు.

మరో రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో అత్యధికంగా 9.49 సెం.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మంచి వర్షాలు నమోదవుతున్నాయి. కానీ యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, జనగామ జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతం నమోదవుతున్నది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 413.4 మి.మీ కురవాల్సి ఉండగా గురువారం వరకు 517.4 మి.మీగా ఉంది. అత్యధికంగా ములుగు జిల్లాలో 1014.3 మి.మీ నమోదైంది.

వ్యవసాయ వ్యాపార కేంద్రాలు నెలకొల్పాలి

- కేంద్ర బడ్జెట్‌లో 'సహకార' నిధులు పెరగాలి
- తెలంగాణలో సహకార సంఘాలతోనే పురోగతి
- రాజ్యసభ చర్చలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యవసాయ వ్యాపార కేంద్రాలను నెలకొల్పాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. గురువారం రాజ్యసభలో సహకార రంగంపై జరిగిన చర్చలో రవిచంద్ర పలు అంశాలను లేవనెత్తారు. సహకార సంఘాల్లో సాంకేతికతను జోడించడం, సభ్యులకు సామాజిక భద్రత పథకానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో సహకార రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ రంగాన్ని బలోపేతం చేస్తూ యువతకు, మహిళలకు మరింత తోడ్పాటు అందించాలని ఆర్థిక మంత్రిని కోరారు. సహకార రంగానికి 2022-23 బడ్జెట్‌లో రూ.900 కోట్లు ఖర్చు చేశారని, 2023-24 బడ్జెట్లో తొలుత కేవలం 55 కోట్లు కేటాయించి, ఆ తతర్వాత మరో 300 కోట్ల అంచనాతో సవరించారని తెలిపారు. ప్రస్తుత 2024-25 బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించారని, పెంపు విషయమై సమీక్షించాలని కోరారు. గత పదేండ్లలో తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు, మహిళా, చేనేత, వివిధ వృత్తిదారులకు ఆయా సహకార సంఘాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పురోగతి సాధించిందని చెప్పారు. ఆ పదేండ్లలో వ్యవసాయం, అనుబంధ సహకార రంగాలు అద్భుతమైన ప్రగతి సాధించాయని వివరించారు. కొత్తగా 8 వేల గొర్రెల పెంపకందారుల సొసైటీలను నెలకొల్పి సుమారు 5 వేల కోట్లతో లక్షలాది యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసినట్టు చెప్పారు. రైతులకు రుణాలు, పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలు అందించడం వల్ల పంటల ఉత్పత్తి భారీగా పెరిగి, వాటిని నిల్వ చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా నూతన గోదాముల నిర్మాణం కూడా చేపట్టినట్టు వివరించారు. సహకార రంగంలో సప్లయ్ వ్యవస్థ సమర్థవంతంగా లేకపోవడం, మౌలిక సదుపాయాలు, రవాణా, మార్కెట్ లింకేజీ వంటి కారణాలతో పంటలు పండించిన తర్వాత రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో వరి, గోధుమ వంటి నిత్యావసర ఆహార ధాన్యాల నష్టాలను అరికట్టే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

కువైట్‌లో తెలంగాణ వాసి అరిగోస

- ఎడారి దేశంలో అవస్థలు పడుతున్న వలస కార్మికుడు
- స్వదేశానికి రప్పించాలని సీఎం, ఎమ్మెల్యేకు విన్నపం
- ఏజెంటు మోసం చేశాడని వీడియో ద్వారా వేడుకోలు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గోడు వెల్లబోసుకుంటున్న రాథోడ్ నాందేవ్

ముథోల్, ఆగస్టు 8: బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లిన తెలంగాణ వాసి అరిగోస పడుతున్నాడు. ఇంట్లో పని ఉందని ఇక్కడికి తీసుకొచ్చి ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. తనను తెలంగాణకు రప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను వేడుకుంటున్నాడు. ఈ మేరకు కువైట్‌లో తాను పడుతున్న బాధలపై ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్.. కుటుంబాన్ని పోషించుకోవడానికి, ఆర్థిక కష్టాలను అధిగమించేందుకు 10 నెలల క్రితం ఓ ఏజెంటు ద్వారా కువైట్‌కు వెళ్లాడు. ఇంట్లో పని అని చెప్పి ఏజెంటు తనను ఇక్కడికి పంపించాడని, తీరా ఇక్కడికొచ్చాక ఇంట్లో పని కాకుండా ఎడారిలో ఒంటెలను మేపడానికి పెట్టారని వాపోయాడు. నెలల తరబడి పట్టణాలకు దూరంగా ఉంటూ ఎండను తట్టుకోలేక పలుమార్లు అనారోగ్యానికి గురయ్యానని ఆవేదన వ్యక్తంచేశాడు. యజమాని వేధిస్తున్నాడని మనస్తాపం చెందాడు. ప్రథమ చికిత్స కూడా చేయించడం లేదని కన్నీటి పర్యంతమయ్యా డు. తనను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదుకుని తెలంగాణకు రప్పించాలని వేడుకుంటున్నా డు. మరోవైపు.. కుటుంబ పెద్ద లేని లోటు తమను మానసికంగా వేధిస్తున్నదని, ప్రజాప్రతినిధులు స్పందించి తన భర్తను సురక్షితంగా రప్పించేందుకు సాయం చేయాలని రాథోడ్ భార్య, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులపై కమిటీ

- త్వరలో నియమించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఓ కమిటీని నియమించనున్నది. రేషన్ కార్డులతో సంబంధం లేకుండా అందరికీ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ కమిటీ ఇప్పటికే ఉన్న లబ్ధిదారులతోపాటు కొత్త అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహించనున్నది. ప్రస్తుతం ఉన్న విధానాలు, వాటి అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలపై కూడా ఈ కమిటీ దృష్టి సారించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 54,45,658 జాతీయ ఆహార భద్రత కార్డులతోపాటు 35,50,496 స్టేట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కుటుంబాలతోపాటు ప్రస్తుతం రేషన్ కార్డులు లేని కుటుంబాలను కూడా కలిపి మొత్తంగా 3 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు.

చెరువు లెక్క.. బ్రహ్మదేవరకెరుక!

- చెరువు శిఖం 60 ఎకరాలు అన్యాక్రాంతం
- ఆ భూమి విలువ రూ.30 కోట్ల పైమాటే
- మూడు వైపులా శిఖం భూముల ఆక్రమణ
- రూ.100 కోట్ల లిఫ్టు పనులకు శంకుస్థాపన
- కబ్జాలతో తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

బ్రహ్మదేవర చెరువు

ఆక్రమణకు గురైన బ్రహ్మదేవర చెరువు కట్ట

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో అక్రమార్కులకు ఇదే అవకాశంగా తెగబడుతున్నారు. చెరువు శిఖాల్లో మట్టిని పూడ్చి మడులు కడుతున్నారు. చెరువుల్లోనే బోర్లు వేసి సాగు చేసుకుంటున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 60 ఎకరాల వరకు కబ్జా చేశారు. ఊరందరనీ సాదిన చెరువు ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా కొనసాగుతున్నది. బ్రహ్మదేవర చెరువు లెక్క బ్రహ్మదేవుడికే తెలుసునని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో కాకతీయులు నిర్మించిన బ్రహ్మదేవర చెరువు మండలంలోనే అతిపెద్దది. చెరువు విస్తీర్ణం 191ఎకరాలు. వెయ్యి ఎకరాలకుపైగా ఆయకట్టు. 24 గ్రామాలకు తాగునీరు అందించే కల్పతరువు. నిరుడు సెప్టెంబర్‌లో అయిటిపాముల రిజర్వాయర్ వద్ద రూ.100 కోట్ల లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు నాటి ఆర్థికమంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ లిఫ్టు పూర్తయితే మూడు మండలాల్లోని 11 గ్రామాల్లో సుమారు 11 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. ఇన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించే రిజర్వాయర్‌ను కట్టవైపు మినహా మూడు వైపుల నుంచి శిఖాన్ని కొందరు రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు.

మట్టితోనే పూడ్చి.. అచ్చుకట్టి..

చెరువు శిఖం భూమి అంటే.. చెరువు నీళ్లు నిల్వ ఉండే ప్రాంతం. ఎవరికైనా ప్రభుత్వం పట్టా ఇచ్చి ఉంటే ఆ భూమి తేలినప్పుడే సాగుచేసుకోవాలి. ఆ ప్రాంతంలో చెట్లు నరకడం, మట్టి తవ్వడం వంటివి చేయకూడదు. కొందరు అక్రమార్కులు చెరువు మట్టిని ట్రాక్టర్లతో తరలించి శిఖం భూమిని ఆక్రమించారు. మడులుగా అచ్చుకట్టి సాగుచేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో చెర్వుఅన్నారం, ఇతర గ్రామాల రైతులు ఒక్కొక్కరు మూడెకరాల నుంచి పదెకరాల వరకు ఆక్రమించుకున్నారు. చెరువును పూడ్చుతూ సాగు చేసుకోవడమేకాకుండా చెరువులోనే ఇటీవల బోర్లు కూడా వేశారు. ఇప్పటివరకు 60 ఎకరాల చెరువు శిఖాన్ని కలిపేసుకున్నారు. జాతీయ రహదారి సమీపంలో కనుక ఎకరం కనీసం రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. ఈ లెక్కన భూమి విలువ అక్షరాల రూ.30 కోట్లకు పైమాటే. పదేండ్లపాటు కాలమై చెరువులో నీళ్లు నిండుగా ఉన్నాయి. నిరుడు రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయింది. ఇదే అదనుగా ఇంకో అడుగు ముందుకేసి చెరువు అలుగును కూడా కబ్జా చేశారు. అలుగువరకు మట్టిని పూడ్చి మడులు అచ్చుకట్టారు. పడమటి వైపు అలుగు భూమి పూర్తిగా కబ్జాకు గురైంది. ఈ ఏడాది వేసవిలో గుట్టను దాపుగా చేసుకొని చెరువు మట్టిని తరలించి పెద్దమొత్తంలో ఆక్రమణకు తెగబడ్డారు. ఫలితంగా రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నది తప్ప పట్టించుకోవడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

చెరువులు, కుంటలు కబ్జా..

అయిటిపాములలో రికార్డుల ప్రకారం.. బ్రహ్మదేవర చెరువు కాకుండా 86 ఎకరాల్లో మెదుగుల చెరువు, 12.31 ఎకరాల్లో చౌడమ్మ కుంట,11.39 ఎకరాల్లో కుతురోని కుంట, రసూల్‌గూడెంలో 10.24 ఎకరాల్లో ఊరకుంట, 6 ఎకరాల్లో తీగలమ్మ చెరువు (కుమ్మరికుంట), 5 ఎకరాల్లో కానాలకుంట, అన్నారం రోడ్డులో 2.38 ఎకరాల్లో నేలమరికుంట, మరో 3-4 కుంటలు ఉన్నాయి. కుమ్మరికుంట పూర్తి కబ్జాకు గురికాగా, మిగతా కుంటలు అధికశాతం ఆక్రమణదారుల చేతుల్లో చిక్కాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: డీఈఈ

అయిటిపాముల చెరువు, కుంటల ఆక్రమణల గురించి డీఈఈ భూషణాచారిని వివరణ కోరగా.. రిజర్వాయర్ ఆక్రమణ గురించి కొందరు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి వచ్చిన తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.